సాక్షి
తిరుపతి

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



నమో నారసింహా
ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు సైదాపురానికి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రథం చేరుకుంది. - 8లో



గంజాయి స్వాధీనం
తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు గూడూరు సెబ్ అధికారులు తెలిపారు. - 8లో



అన్నదాత సుఖీభవ
తిరుమలలో ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణతో భక్తుల సేవలో దాతలు తరించే అవకాశాన్ని టీటీడీ కల్పించింది. - 8లో

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఆర్డీఓతో రెవెన్యూ ఉద్యోగ సంఘం నేతలు

తిరుపతి అర్బన్: అందరికీ అందుబాటులో ఉంటూ డివిజన్ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నుంచి తిరుపతికి వచ్చినట్టు వెల్లడించారు. కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుని పాదాల చెంత పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం పలువురు రెవెన్యూ అధికారులు ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. ఇందులో తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, రూరల్ తహసీల్దార్ సుబ్రమణ్యం, అర్బన్ డెప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, వీఆర్వోల సంఘం తిరుపతి డివిజన్ అధ్యక్షుడు చెంగల్రాయల్, జిల్లా నేతలు నాగరాజు, ప్రసాద్, భాస్కర్, సుమన్, భూపతి తదితరులు ఉన్నారు. అనంతరం ఆర్డీఓ మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితోపాటు పలువురు అధికారులను కలిశారు.

ఆర్బీకేల్లో ఈ క్రాప్ ముసాయిదా జాబితా



వడ్డిపల్లిలో జాబితాను పరిశీలిస్తున్న రైతులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయశాఖకు చెందిన ఈ క్రాప్ ముసాయిదా జాబితాను గురువారం ప్రదర్శించారు. ఆ మేరకు ఆయా గ్రామాలకు చెందిన రైతులు జాబితాలోని తమ పేర్లను చెక్ చేసుకున్నారు. సామాజిక తనిఖీ కోసం జాబితాను ఈ నెల 29వ తేదీ వరకు ప్రదర్శించనున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1,44,942 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. ఆ మేరకు ఈ క్రాప్ పూర్తిచేయించి ఆర్బీకేల్లో ప్రదర్శించారు.

ముఖ ఆధారిత హాజరు ప్రారంభం



ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరును ప్రారంభిస్తున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగుల ముఖఆధారిత హాజరు విధానాన్ని గురువారం టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో ఏవీ.ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీలో 8 వేలకుపైగా రెగ్యులర్ ఉద్యోగులు, 10 వేలకుపైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ ముఖఆధారిత హాజరును అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. తిరుమల, తిరుపతిలోని టీటీడీ కార్యాలయాలతో పాటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇతర సంస్థల్లో ముఖ ఆధారిత హాజరును అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఐటీ జనరల్ మేనేజర్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కొరియాలో మహిళా వర్సిటీ బృందం



డిజిటల్ లీడర్ షిప్‌పై జరిగిన కార్యక్రమంలో మహిళా వర్సిటీ బృందం

తిరుపతి సిటీ: కొరియాలోని ఇంచియాలో గత రెండు రోజులుగా జరుగుతున్న డిజిటల్ లీడర్ షిప్ కార్యక్రమంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బృందం పాల్గొంది. రిజిస్ట్రార్, ప్రొఫెసర్ రజని, ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ ఉమామహేశ్వరీదేవి, కమ్యూనికేషన్ ఇన్ జర్నలిజం ప్రొఫెసర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు డిజిటల్ పరివర్తనపై ఆవిష్కరణలకు అవసరమైన జ్ఞానాన్ని అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్షణంగా చదువు



మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలే కాకుండా హామీ ఇవ్వని పథకాలను కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. సివిల్స్ పరీక్షల్లో అర్హత సాధించిన బలహీన వర్గాల అభ్యర్థులకు శిక్షణ కోసం జగనన్న సివిల్స్ ఇన్సెంటివ్(ప్రోత్సాహకం) పేరుతో పథకం అమల్లోకి తెచ్చారు. ఏటా సివిల్స్ ప్రిలిమినరీ క్వాలిఫై అయిన వారికి రూ.లక్ష, మెయిన్స్ క్వాలిఫై అయిన వారికి అదనంగా మరో రూ.50 వేల అందజేయనున్నారు. ఈ పథకం విధి విధానాలు ఖరారు చేస్తూ జీవో విడుదల చేశారు.

- సివిల్స్ ప్రిపరేషన్ కోసం జగనన్న ప్రోత్సాహక పథకం
- పేద విద్యార్థులను సివిల్స్ వైపు ప్రోత్సహించేందుకు ఆర్థిక అండ
- విద్యా వ్యవస్థ కొత్తపుంతలు తొక్కుతోందంటున్న విద్యావంతులు
- నవంబర్ 4వరకు దరఖాస్తుకు గడువు
- జగనన్నకు రుణపడి ఉంటామంటున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎందరో పేద విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని కలలు కంటారు. ఆర్థిక ఇబ్బందులతో కలలు కలలుగానే నిలిచి పోయి ఏదో కోల్పోయామని మదన పడుతుంటారు. ఈనేపథ్యంలో సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏటా నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలను అధిక సంఖ్యలో రాసేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సివిల్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు జగనన్న సివిల్ సర్వీసెస్ ఇన్సెంటివ్ పథకాన్ని ప్రవేశపెడుతూ విధివిధానలతో జీవో ఎంఎస్ 58ని ప్రభుత్వం విడుదల చేసింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఈ పథకం వర్తిస్తుంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారు మెయిన్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తుంది. మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అవసరమైన కోచింగ్, ఇతర అవసరాల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తుంది.

అర్హతలు ఇవి

- అభ్యర్థులు తాము సివిల్స్ ప్రిలిమ్స్ లేదా మెయిన్స్‌లో అర్హత సాధించినట్లు ప్రూఫ్ చూపించాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల కుటుంబాల వార్షిక ఆదాయ పరిమితి రూ.8 లక్షలకు మించకూడదు.
- అభ్యర్థుల కుటుంబాలకు 10 ఎకరాల లోపు మాగాణి లేదా 25 ఎకరాల లోపు మెట్ట భూమి మాత్రమే ఉండాలి.
- కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉండకూడదు.

ఉచితం పేరుతో ముంచిన టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సివిల్స్ సర్వీసెస్‌కు శిక్షణ పొందే అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ పేరుతో తూతూ మంత్రంగా కొన్ని కోచింగ్ సెంటర్లను తెరచి అనుభవం లేని అధ్యాపకులతో అభ్యర్థులకు శిక్షణ ఇప్పించారు. ఉచిత కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందిన ఏ ఒక్క విద్యార్థి కనీసం ప్రిలిమినరీ పరీక్ష సైతం ఉత్తీర్ణత సాధించలేక పోయారు. అభ్యర్థులు తమకు నచ్చిన కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందవచ్చనే వెసులుబాటు ఇస్తూ ప్రైవేట్ కోచింగ్ సెంటర్లతో కుమ్మక్కై నిధులను స్వాహా చేసి విద్యార్థులను నట్టేట ముంచారు. 2018లో రాష్ట్రంలోని కొన్ని యూనివర్సిటీలలో విద్యార్థులకు ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ కోర్సుల పేరుతో సివిల్స్ కోచింగ్ ఇస్తామని విద్యార్థులను మభ్యపెట్టి ప్రైవేటు వ్యక్తులకు కోచింగ్ బాధ్యతలను అప్పజెప్పారు. ప్రభుత్వం నుంచి అందే స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పక్కా ప్రణాళికతో కాజేశారు. ఇటువంటి అక్రమాలకు ఫుల్‌స్టాప్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించనుంది.

సివిల్స్ సాధిస్తామనే ధైర్యం కలుగుతోంది



నేను తిరుపతి గిండి ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంటున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా పేదల కోసం ప్రవేశపెట్టి జగనన్న ప్రొత్సాహక పథకం చాలా మందిని సివిల్స్ వైపు దృష్టిపెట్టేలా చేసింది. ప్రిలిమ్స్ కొంత కష్టపడి ఉత్తీర్ణులైతే మెయిన్స్‌కు ఈ పథకంతో కొంత ఆసరా లభిస్తుంది. మంచి కోచింగ్ తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది.

– మణిదీప్, సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థి, తిరుపతి

మా లాంటి వారికి ఆసరా



సివిల్స్‌పై ఆసక్తి ఉన్న మాలాంటి విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రిలిమ్స్ కొంత మేర ఉత్తీర్ణత సాధిస్తామనే ధైర్యం ఉంది. మెయిన్స్ కోసం ప్రభుత్వం అందించే ప్రోత్సాహకంతో మంచి కోచింగ్ తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–కృష్ణవేణి, సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థిని, తిరుపతి

దరఖాస్తు ఇలా..



2023లో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి వచ్చే నెల 4వ తేదీ లోపు ఏపీ జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఉన్నత లక్ష్యాన్ని ఎంపిక చేసుకున్న పేద విద్యార్థులను ప్రొత్సహించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– యూ.చెన్నయ్య, తిరుపతి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి

చాలా గొప్ప పథకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద విద్యార్థులు రుణపడి ఉంటారు. నాకు సివిల్స్ సర్వీసెస్ లాంటి పోటీ పరీక్షలకు అధ్యాపకునిగా 30ఏళ్ల అనుభవం ఉంది. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రొత్సాహక పథకం చాలా గొప్పది. కోచింగ్ సెంటర్లకు లక్షలు కుమ్మరించలేని నిరుపేదలకు ఇది ఊరటనిచ్చే అంశం. ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన చాలామంది మెయిన్స్‌లో తప్పుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం సరైన కోచింగ్ లేకనే. ఆర్థిక సాయం చేసి ప్రోత్సహించడం శుభపరిణామం. ఎక్కువ మంది పేదలు సివిల్స్ వైపు మొగ్గ చూపుతారు.

– డాక్టర్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి, ఎస్వీయూ వీసీ మెంబర్, సీకాం విద్యాసంస్థల చైర్మన్

పేద వర్గాలకు వరం



సివిల్స్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించాలని చాలామంది కలలు కంటారు. కొంత కష్టసాధ్యంతో కూడుకున్న పరీక్ష ఇది. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైనా మెయిన్స్ కోసం కచ్చితంగా కోచింగ్ తీసుకోవాల్సిందే. అటువంటి పరిస్థితిలో పేదలకు కోచింగ్ తీసుకునే స్థోమత లేని అభ్యర్థులు మెయిన్స్‌లో చాలా మంది వెనుకబడుతుంటారు. అటువంటి వారికి జగనన్న ప్రోత్సాహక పథకం వరం లాంటిది. మెయిన్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్వ్యూ కోసం శిక్షణ పొందేందుకు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. అటువంటి వారికి ఈ పథకం ఆసరా.

– డాక్టర్ సురేష్ కుమార్ గిండి, ఆంథ్రోపాలజీ, సీనియర్ సివిల్స్ పోటీ పరీక్షల అధ్యాపకుడు, తిరుపతి

పేదలకు ఆరోగ్య సంజీవిని జగనన్న సురక్ష



సురక్ష కిట్‌ను అందజేస్తున్న మేయర్ శిరీష, హెల్త్ ఆఫీసర్ శ్రీహరి

తిరుపతి తుడా: పేదలకు ఆరోగ్య సంజీవిని జగనన్న సురక్ష అని, జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు తిరుపతి జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నడుస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. తిరుపతిలోని జీవకోన, ప్రకాశం రోడ్ ఎల్ఐసీ రోడ్, గాంధీ ట్రస్ట్ భవన్ ప్రాంతాల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. తిరుపతి నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీషతో ఆయన వైద్య శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష కొంతమంది రోగులకు స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఏదైనా అనారోగ్య సమస్యలుంటే ఆదిలోనే గుర్తించి నాణ్యమైన వైద్యం ద్వారా అంతముందించాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా అందించడంతోపాటు మందులను సైతం అక్కడికక్కడే అందజేస్తున్నట్టు వెల్లడించారు. ప్రతి మెడికల్ క్యాంపులో ఐదుగురు స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రాథమిక వైద్య పరీక్షలతో పాటు ఏడు రకాల టెస్టులు నిర్వహించి వ్యాధుల నిర్ధారణ జరుగుతోందని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రేవతి, ఆదిక్ష్మి, ఇతర అధికారులు రవి, మధుబాబు పాల్గొన్నారు.

1 నుంచి సంక్షేమ పథకాల ప్రదర్శన



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన 34 సంక్షేమ పథకాలను ఆయా సచివాలయాల పరిధిలో పథకాల వారీగా లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని, నెల రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. సచివాలయాల వద్ద ప్రచార బోర్డులను స్థానిక అతిథులచేత ప్రారంభించాలన్నారు. ఆ మేరకు ఫొటోలతోపాటు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

సంక్షేమయాత్రచేద్దాం రండి!

- 'నాకు కొన్ని టీవీ చానళ్లు, పత్రికలు తోడులేకపోవచ్చు. దత్తపుత్రుడు అండగా రాకపోవచ్చు. మీ బిడ్డ నమ్ముకున్న దల్లా పైన ఆ దేవుడిని.. కింద ఉన్న ప్రజలనే. ఈ నాలుగున్నరేళ్లలో మీ కుటుంబానికి ఏదో రూపంలో మంచి జరిగి ఉంటే దాన్నే కొలమానంగా చేసుకోండి. వచ్చే ఎన్నికల్లో మీరే సైనికులుగా రండి'.. ఇదీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సభలోనూ హోరెత్తిస్తున్న పిలుపు..
- 'మేము మేలుచేశాం.. అది చెప్పడానికే ముందుకు వస్తున్నాం' ఇదీ ప్రజాప్రతినిధుల పలుకు..

- నేడు తిరుపతిలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభం
- సాయంత్రం 4 గంటలకు గ్రూప్ థియేటర్స్ వద్ద బహిరంగ సభ



సామాజిక సాధికార బస్సు యాత్రపై నేతలతో చర్చిస్తున్న ఎంపీ విజయ్‌సాయిరెడ్డి

సాక్షి, తిరుపతి: సామాజిక సాధికార బస్సు యాత్రకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న ఈ యాత్రపై వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణ కోస్తాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి గురువారం తిరుపతి జిల్లా పార్టీ అధ్యక్షులు నేదురమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆదిమూలం, తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నేతలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బడుగుబలహీన వర్గాలకు చేసిన మేలును గుర్తుచేస్తూ, వారి సంక్షేమానికి అందించిన పథకాలను వివరిస్తూ బస్సు యాత్ర సాగుతుందన్నారు. తిరుపతిలో శుక్రవారం ఉదయం 9గంటలకు బాలాజీ కాలనీలోని జ్యోతీరావ్‌పూలే విగ్రహం నుంచి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. తర్వాత తిరుపతి నగరంలోని అన్ని డివిజన్లలో యాత్ర కొనసాగుతుందన్నారు. ఆపై సాయంత్రం 4 గంటలకు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ సమీపంలోని గ్రూప్ థియేటర్స్ వద్ద భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. సామాజికవర్గ నేతలు, ప్రజలతో పాటు కార్పొరేటర్లు, అనుబంధ సంస్థల చైర్మన్లు, అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

అన్ని వర్గాలకు లబ్ధి

'గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుని వదిలేసిన ప్రభుత్వాలను చూశాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలతో పాటు నామినేటెడ్ పదవులు సామాజిక వర్గాల వారీగా కట్టబెట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు పెద్దపీట వేశారు. అదేవిధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. కులం, మతం, వర్గం తేడా లేకుండా అన్ని పార్టీల వారికీ లబ్ధి చేకూర్చారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ఇంటింటికీ చేరవేశారు..' అని విజయ్‌సాయిరెడ్డి పేర్కొన్నారు.

ఆయుధాల వినియోగంపై అవగాహన



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ



ఆయుధాల ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



వ్యాసరచన పోటీలు

తిరుపతి క్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఆయుధాలు, సాంకేతికమరమైన వస్తువుల పై అవగాహన కల్పించినట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఈనెల 21వ తేదీ నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. అందులో భాగంగా ఎంఆర్ పల్లి సమీపంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఓపెన్ హౌస్‌లో పోలీసులు ఉపయోగించే ఆయుధాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ప్రారంభించారు. పోలీసులకు కూడా సోషల్ మీడియా వేధింపులు, సైబర్ నేరాలు అరికట్టడంలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొదటి ముగ్గురికి ప్రోత్సాహ బహుమతులుగా రూ.5000, రూ.3000, రూ.2000లను వారోత్సవాలు ఆఖరి రోజున అందిస్తామన్నారు. ఏఎస్పీల వెంకటరావు, కులశేఖర్, సాయి దాతలం ఏఎస్పీ లక్ష్మీనారాయణ రెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

ఎంపీ విజయ్‌సాయిరెడ్డికి సాదర స్వాగతం



విమానాశ్రయం నుంచి వెలుపలకు వస్తున్న రాజ్యసభ సభ్యులు విజయ్‌సాయిరెడ్డి, పక్కన ఎంపీ గురుమూర్తి

రేణిగుంట: వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయ్‌సాయిరెడ్డికి గురువారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుపతిలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రలో కార్యక్రమంలో పాల్గొనేందుకు చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, పలువురు పార్టీ నాయకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి వెళ్లారు.

స్విమ్స్‌లో కాగిత రహిత డాక్యుమెంటేషన్ విధానం

తిరుపతి తుడా: స్విమ్స్ ఆసుపత్రిలో నూతనంగా కాగిత రహిత డాక్యుమెంటేషన్ విధానానికి శ్రీకారం చుట్టారు. గురువారం కంప్యూటర్ ఆన్ వీల్స్(సీఓడబ్ల్యూ) పేరుతో ట్యాబ్‌ల సహాయంతో దీనిని ప్రారంభించారు. దీంతో హెల్త్ కేర్ సిస్టమ్‌లో రోగుల సమాచారాన్ని నమోదు చేయడంతో పాటు సులువుగా ఎల్రక్టానిక్ హెల్త్ రికార్డులో పూర్తి వివరాలను నమోదు చేయడానికి వీలవడమే కాకుండా జాప్యాన్ని తగ్గించవచ్చు. దీంతో పాటు రోగుల కచ్చితమైన సమాచారాన్ని సరైన సమయానికి తప్పిదాలు లేకుండా పొందుపరచవచ్చు. త్వరితగతిన రోగుల ల్యాబ్ రిజల్ట్స్‌ను, రోగికి అందుతున్న, సూచించిన మెడిసిన్ వివరాలను తెలుసుకునేందుకు వీలుంటుంది. దీంతో రోగుల చికిత్స విషయంలో వైద్యులు త్వరితగతిన నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

అన్నదాత సుఖీభవ..

- రూ.38 లక్షలతో అన్నప్రసాద వితరణకు అవకాశం
- దాతలు స్వయంగా వడ్డించవచ్చు
- దాతల పేరు ప్రదర్శన



తిరుమల: తిరుమలలో ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణతో భక్తుల సేవలో దాతలు తరించే అవకాశాన్ని టీటీడీ కల్పించింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు రుచిగా, శుచిగా ఒక రోజు అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒకరోజు విరాళ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ కోసం రూ.38 లక్షలు విరాళం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విరాళం మొత్తం ఇప్పటివరకు రూ.33 లక్షలు ఉండగా, పెరిగిన ధరల నేపథ్యంలో టీటీడీ రూ.38 లక్షలకు పెంచింది.

- ఉదయం అల్పాహారం కోసం రూ.8 లక్షలు, మధ్యాహ్న భోజనం కోసం రూ.15 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.15 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు.
- విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద భవనంలో బోర్డులో ప్రదర్శిస్తారు. అదేవిధంగా దాతలు తమ కోరిక మేరకు ఒక రోజు ఇక్కడ అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని పొందొచ్చు.

అన్నప్రసాదాలు అందే ప్రాంతాలు

ప్రస్తుతం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1, 2లోని కంపార్ట్‌మెంట్లు, బయటి క్యూలు, పీఏసీ-4(పాత అన్నప్రసాదం), పీఏసీ-2, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్స్‌లు, రుయా ఆస్పత్రి, స్విమ్స్, మెటర్నిటీ ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ జరుగుతోంది.

- తిరుమలలోని ఫుడ్ కౌంటర్లలో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, 2లోని కంపార్ట్‌మెంట్లు, వృద్ధులు, దివ్యాంగులు వేచి ఉండే కాంప్లెక్స్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన కాంప్లెక్స్, ప్రధాన కల్యాణకట్టలో టీ, కాఫీ, చంటిపిల్లలకు పాలు అందిస్తున్నారు.

పర్వదినాల్లో 3 లక్షల మందికి పైగా..

తిరుమలలో జనవరి 1న నూతన ఆంగ్ల సంవత్సరాది, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి పర్వదినాలు, బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున 3లక్షల మందికి పైగా భక్తులకు టీటీడీ అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తోంది.

వెంగమాంబ అన్నప్రసాద భవనం..

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగలి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 10.30 గంటల వరకు చక్కెర పొంగలి, చట్నీ, అన్నం, కూర, సాంబారు, రసం, మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. తిరుమలలో అన్నప్రసాదాల తయారీకి రోజుకు 14 నుంచి 16.5 టన్నుల బియ్యం, 6.5 నుంచి 7.5 టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు.

బ్యాంకు రుణాల మంజూరు సులభతరం చేయండి



మాట్లాడుతున్న తిరుపతి లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సుభాష్

చంద్రగిరి: స్వయం సహాయక మహిళలు, రైతులు, విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాల మంజూరును మరింత సులభతరం చేయాలని తిరుపతి లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఆర్.సుభాష్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తిరుపతి వెలుగు అధికారి సుబ్బారెడ్డి, ఆర్ఎస్ఈటీఐ ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్‌బాబు, చంద్రగిరి యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహేష్ కుమార్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులకు రుణాలు ఇవ్వడంలో సహకరించాలని బ్యాంక్ ప్రతినిధులను కోరారు. పంట రుణాలను ప్రతి రైతుకూ ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకుల మీద ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై రైతులకు మరింతగా అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహించాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డులపై రైతులకు ఉన్న అపోహలు తొలగించి, దరఖాస్తులు చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ అధికారులపై ఉందన్నారు. పాత కార్పొరేషన్ రుణాల గ్రౌండింగ్, పెండింగ్ రుణాల రికవరీ తదితర అంశాలపై బ్యాంకుల వారీగా విశ్లేషించారు. వెలుగు ఎస్‌హెచ్‌జీ, వ్యవసాయ, వ్యక్తిగత రుణాల మంజూరులో ఖాతాదారులను ఇబ్బంది పెట్టకుండా నిబంధనల మేరకు ఇవ్వాలని ఆయన ఆదేశించారు .రెన్యువల్ విధానంపై పలు సూచనలు చేశారు. ఔత్సాహిక మహిళలను చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలని, దీనికి రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణ ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంతోపాటు రొంపిచర్లకు చెందిన బ్యాంకు అధికారులు, వ్యవసాయ, వెటర్నరీ, వెలు గు, హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ సీఈవోగా కనకనరసారెడ్డి



–స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా చంద్రశేఖర్‌నాయుడు

తిరుపతి అర్బన్: తిరుపతి ఆర్డీవోగా పనిచేస్తున్న వి.కనకనరసారెడ్డిని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇన్వెస్టిమెంట్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఎల్రక్టానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ క్లస్టర్ (వీఎంసీ) సీఈవోగా నియమించారు. చిత్తూరు, వైఎస్సార్ కడప ఉమ్మడి జిల్లాల్లో విద్యుత్ పరికరాల ఉత్పత్తుల సంస్థల ఏర్పాటు తదితర వ్యవహారాలకు సీఈవోగా వ్యవహరించనున్నారు. అదేవిధంగా చిత్తూరు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌నాయుడును తిరుపతి కలెక్టరేట్‌లో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ (ప్రొటోకాల్-2)గా నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రెండు రోజుల్లో వారు బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎస్వీయూలో నిపుణుల కమిటీ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వరల్డ్ అండ్ అట్మాస్ఫియర్ సైన్సెస్ నిపుణుల కమిటీ సదస్సును గురువారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే.రాజారెడ్డి ప్రారంభించారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో జరిగిన ఈ సదస్సులో వీసీ మాట్లాడుతూ జాతీయ సదస్సుల ద్వారా మేధస్సు పెరగడంతోపాటు భవిష్యత్తుపై తీసుకోవాల్సిన నిర్ణయాలపై స్పష్టత వస్తుందన్నారు. ఎస్వీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో డాక్టర్ యూ.సురేష్, కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ తలత్‌అహ్మద్, ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్, ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తులసి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నమో నారసింహా..



స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవంలో అర్చకులు

సైదాపురం: ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మండల కేంద్రమైన సైదాపురానికి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రథం చేరుకుంది. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో.. మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ ఆధ్వర్యంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి ఆశీనులైన రథం పురవీధుల్లో విహరిస్తుండగా.. భక్తుల గోవిందనామస్మరణలు మిన్నంటాయి. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వివాహ మండపానికి వేంచేపుయగా.. అక్కడ వేదపండితులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ జనార్దన్‌రెడ్డి, సైదాపురం సొసైటీ అధ్యక్షులు గోగినేని శివకుమార్, జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు, సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ శివకుమార్, నేతలు పాల్గొన్నారు.

ఎస్వీయూకి ఐఎస్ఓ గుర్తింపు



ఐఎస్ఓ గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న ఎస్వీయూ వీసీ

తిరుపతి సిటీ: తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఈ మేరకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే.రాజారెడ్డి ఐఎస్ఓ గుర్తింపు పత్రాన్ని గురువారం అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన హెచ్ఓఎం ఇంటర్నేషనల్ సంస్థ రెండు రోజులపాటు ఎస్వీయూను పరిశీలించి విద్యావసరులు, సదుపాయాలు, విద్యాభివృద్ధిపై సంతృప్తి వ్యక్తంచేస్తూ ఐఎస్ఓ గుర్తింపు ఇచ్చినట్టు వెల్లడించారు. 69 సంవత్సరాలుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్న ఎస్వీయూకి ఐఎస్ఓ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. సంస్థ ప్రతినిధి శివయ్య మాట్లాడుతూ ఎస్వీయూలో మెరుగైన విద్య ప్రమాణాలు ఉన్నాయని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రీనరీ, సౌకర్యాలు వంటివి ఆదర్శంగా ఉన్నాయని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎన్విరాన్మెంట్ గ్రీనరీలో ఐఎస్ఓ 14001 సర్టిఫికేషన్, ఎడ్యుకేషన్ క్వాలిటీ మేనేజ్మెంట్‌లో ఐఎస్ఓ 210001 సర్టిఫికేషన్, ఎనర్జీ సేవింగ్‌లో ఐఎస్ఓ 50001 గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. డీన్ ప్రొఫెసర్ అప్పారావు, డాక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను గురువారం టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు. మొదట ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆపై నిర్మాణ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, సభ్యులు ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయుడు రాజవేలు

ఏర్పేడు: మండలంలోని మునగలపాలెం జెడ్పీ హైస్కూలులో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలోఅండర్-14, అండర్- 17 విభాగాల్లో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఒక్కో విభా గంలో స్టాండ్‌బైలతో సహా 14మంది చొప్పున క్రీడాకారులను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు చెప్పారు. త్వరలో ఈ జట్లు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటా యని చెప్పారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు రాజవే లు జ్ఞాపికలు అందజేశారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ మోహన్‌రావు, గణపతి, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

పుత్తూరు రూరల్: పుత్తూరు ఎస్ఆర్ఎస్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19, అండర్-17 బాల బాలికల జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. పోటీలను ఈఎంఓ తిరుమలరాజు ప్రారంభించారు. నారాయణవనం హెచ్ఎం సులోచన ఆధ్వర్యంలో క్రీడా జట్ల ఎంపిక జరిగింది. ఎస్‌జీఎఫ్ నాయకులు సురేష్‌బాబు, బాబు, శరవణ, రమేష్, పీడీలు పాల్గొన్నారు.

అండర్-17 బాలికల జట్టు

జి.వర్షిణి, ఆర్.హేమలత (ఐరాల),ఎం.వసంతి(తిరుచా నూరు), ఎన్.గాయత్రి(శంకరరాయపేట),బి.చరిష్మ, ఏ.త్రిష(ఈఆర్‌పేట), ఏ.కావేరి(డీఎంపురం), టి.అమృత(పరమాల), కేవీ.కల్పన, కె.డి.గిరి జ (నారాయణవనం), పి.బాలప్రవల్లి క (వరదయ్యపాళెం), డి.దేవర్షిణి (ఒత్తూరు), డి.ఇందు (వెదురుకుప్పం), కె.మన్విత (రాజగోపాలపురం), నందిని (నాగలాపురం), ఎం.చాందిని (గొల్లపల్లి)

బాలుర జట్టు

పి.తులసీనాథ్(ఐరాల), ఎం.పువికుమార్(టీఆర్‌పురం), పీఎస్.ప్రవీణ్, వై.భార్గవ్(నారాయణవనం), ఆర్.నాగచైతన్య(రంగంపేట), జి.జ్యోతీష్(ఐరాల), సి.భరత్, దినేష్(ఈఆర్‌పేంట), గుజన్‌రాజ్(నాగలాపురం), తరుణ్(వెదురుకుప్పం), డి.యశ్వంత్(డిఎంపురం), ఎం.విష్ణు(శంకరాయపేట), అజయ్(అప్పినాపల్లె), ఎస్.మహమ్మద్‌అలీ(పాకాల), బి.శేతన్‌సాయి(ఎస్‌బీఆర్‌పురం), ఎస్.శుభాష్(వెంగళత్తూరు)

అండర్-19 బాలికల జట్టు

బి.ఐశ్వర్య, ఎన్.స్పందన (పిచ్చాటూరు), ఎం.చైతుర్య, ఎం.ప్రవల్లిక(తిరుపతి), సి.రూప, కె.జాహ్నవి, రేణుక(ఐరాల), ఎన్.నవ్య, ఏ.ఉమా(వెదురుకుప్పం), డి.ఇస్మీనా(రేణిగుంట), జి.నందిని, పి.అక్షయ, బి.కీర్తన(ఈఆర్‌పెంట), జి.మధుమతి(గొల్లపల్లి), పి.కౌశల్య(పరమాల), కె.భావన(సత్యవేడు)

అండర్-19 బాలుర జట్టు:

కె.విష్ణు, ఎన్.చైతన్య, ప్రవీణ్‌సాయి, సంతోష్ (ఐరాల), జి.ఎస్.చైతన్య, ఎం.టి.నవీన్‌కుమార్ (పుత్తూరు), జె.తేజ (సిద్దంపల్లి), కె.ఉదయ్‌సాయి, చెంచునాగేంద్ర (నారాయణవనం), ఎం.సందీప్(రాగిమానుపేట), వరదరాజులు (వడమాలపేట), పి.కృష్ణచైతన్య (సత్యవేడు), బి.కేశవదాస్ (తిరుచానూరు), టి.భద్రేష్ (తిరుపతి), వి.కిరణ్‌కుమార్(గొల్లపల్లి), డి.శ్రీకాంత్ (ములకలచెరువు)

దర్గాగా కబ్జా

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



పునాదుల కోసం తీసిన గోతులు

చంద్రగిరి: దర్జాగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ప్రహరీ గోడను నిర్మించుకున్న ఘటన గురువారం మండల పరిధిలోని కొటాల పంచాయతీలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ పదేళ్ల క్రితం సర్వే నం.225/1బీలో కొంత భూమిని కొనుగోలు చేసింది. అయితే ఆ భూమికి ఆనుకున్న ఉన్న సుమారు 60 అంకణాల రోడ్డు పోరంబోకు ఆక్రమించుకుంది. ఆపై వెనుక ఉన్న ఇంటికి దారి లేకుండా ప్రహరీని నిర్మించేందుకు పూనుకుంది. దీంతో కొటాల గ్రామానికి చెందిన బాధితులు మునికృష్ణ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఓ గిరి, సెక్రటరీ మధు, సచివాల సర్వేయర్ వాణిశ్రీ ఘటన స్థలానికి చేరుకుని ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంతో పాటు ఇంటికి దారి లేకుండా ఆక్రమించడంపై ప్రశ్నిస్తే అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రహరీ గోడ నిర్మాణానికి తీసిన గోతులను పూడ్చివేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,422 మంది స్వామివారిని దర్శించుకోగా 23,998 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.30 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గంజాయి స్వాధీనం

గూడూరు రూరల్: తనిఖీల్లో గురువారం ఓ వ్యక్తి నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ అధికారులు తెలిపారు. ఈ మేరకు రెండవ పట్టణ సెబ్ కార్యాలయంలో సీఐ విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అరుంధతీయపాళెం వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో గమ్మళ్లపాళెంలో నివాసం ఉండే గంపల మస్తానయ్య అనే వ్యక్తి ఇటీవల ఒడిశాలోని మల్కన్గిరి జిల్లాలో ఓ వ్యక్తి నుంచి రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేశాడన్నారు. ఆపై తనకు అవసరమైనంత ఉంచుకుని మిగిలిన ఒకటిన్నర కేజీ గంజాయిని స్థానికులకు విక్రయించడం ప్రారంభించాడని తెలిపారు. ఈ మేరకు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు వెల్లడించారు. తనిఖీలలో ఎస్ఐ శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చంద్రగిరి: మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. బంధువుల వివరాల మేరకు.. మండల పరిధిలోని గంగుడుపల్లి పంచాయతీ మండపంపల్లి గ్రామంలో రైతు బండి కృష్ణారెడ్డి(82) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే తన ఇంటి పక్కన నుంచి తరచూ ట్రాక్టర్లు వెళ్తుండడంతో ఇంటిని ఢీకొట్టే ప్రమాదం ఉందన్న ఉద్దేశంతో ఈనెల 18వ తేదీన అడ్డుగా రాళ్లను ఏర్పాటు చేశాడు. దీంతో గ్రామస్తులు కొందరు కృష్ణారెడ్డిపై దాడికి పాల్పడ్డారు. తీవ్ర మనస్తాపానికి గురైన కృష్ణారెడ్డి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తిరుపతిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.